క్లుప్తంగా

6న పనిముట్ల ఎంపికపై సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): ఆదరణ-3 పథకం కింద వృత్తిదారులకు అవసరమైన పనిముట్ల ఎంపిక, సరఫరాపై ఈ నెల 6న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

8 మంది జూదరుల అరెస్టు

కొండపి: మండలంలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల మధ్య పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. పెరిదేపి, ముప్పారాజుపాలెం గ్రామాల మధ్యలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని ఆ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16170 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై ప్రేమ్ కుమార్, కానిస్టేబుళ్లు రవి, శ్రీకాంత్, అనిల్, శంకర్ పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్‌స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హష్తార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్ లేదా మోడల్‌స్కూల్ వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 రుసుంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న మోడల్ స్కూలులో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మెరిట్ లిస్ట్ ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్స్ కేటాయిస్తామని చెప్పారు. 6వ తరగతిలో 100 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7017286715 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వానపాములతో నేల సారవంతం



తయారుచేసిన పీఎండీఎస్ కిట్లతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: వానపాములు నేలను సారవంతం చేస్తాయని ప్రకృతి వ్యవసాయం విభాగం డీపీఎం వి.సుభాషిణి అన్నారు. మండలంలోని స్థానిక రైతు సేవా కేంద్రంలో 20 రకాల విత్తనాలతో విత్తనశుద్ధి చేసి 100 పీఎండీఎస్ కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎండీఎస్ విత్తనాలు నేలలో చల్లడం వల్ల తొలకరి వర్షాలకు నేలలో విత్తనాలు పెరిగి వానపాములు నేలను సారవంతంగా తయారు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ మనోజ్, ఎంటీ ఎస్టేర్, యూనిట్ ఇన్‌చార్జి మందాకిని, మాధవ ఐసీఆర్పీలు జ్యోత్స్న, మాలకొండయ్య, గౌతమి, వీఏఏ వెంకటనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కాంప్లెక్స్ చైర్మన్ బొప్పరాజు పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అమలు చేసి మెనూలో తేడాలు లేకుండా జాగ్రత్తగా వంట చేయాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు.

శ్రీధర్‌బాబుకు ఘన సన్మానం



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న బోర్డు అధికారులు, రైతు నాయకులు

కందుకూరు: గత ఏడేళ్లుగా పొగాకు బోర్డు ఈడీగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన అద్దంకి శ్రీధర్‌బాబును రైతులు సోమవారం ఘనంగా సన్మానించారు. శ్రీధర్‌బాబు సేవలను కొనియాడారు. ప్రధానంగా గత రెండేళ్లలో అధికంగా పండించిన పొగాకుపై ఎటువంటి జరిమానాలు లేకుండా అమ్ముకున్నామని, దీని వల్ల రూ.100కోట్ల వరకు రైతులకు ఆదాయం వచ్చిందన్నారు. పొగాకు చూరను అధికారికంగా వేలం కేంద్రాల్లో అమ్మించారని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే గడువును 15 రోజుల నుంచి 8 రోజులకు తగ్గించారన్నారు. రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ సకాలంలో అందించడంతో పాటు బ్యారన్ ఇన్సూరెన్స్‌ని రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలకు, వ్యక్తిగత ఇన్సూరెన్స్‌ను రూ. లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారని కొనియాడారు. అలాగే కోటి రూపాయల ఖర్చుతో స్థానిక పొగాకు బోర్డులను ఆధునీకరించాలని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఈడీ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు రైతులకు సేవ చేసే అవకాశం ఈడీగా తనకు దక్కిందని, రైతులు అడిగిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశానని చెప్పారు. ఆర్‌ఎం ఎం లక్ష్మణరావు, బోర్డు వేలం నిర్వహణాధికారి కేవీ రామాంజనేయులు, కందుకూరు-1,2 వేలం కేంద్రాల నిర్వహణాధికారులు ఎం కిరణ్, బి.చంద్రశేఖర్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్లు శివకుమార్, రాజగోపాల్, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఆర్భాటం సరే.. ఆచరణ ఏది..?

- ప్రకటనలకే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
- భారీగా చెత్త నిల్వలు
- దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న చెత్త నుంచి సంపద కేంద్రాలు



ఊళ్లపాలెం బీచ్‌కు వెళ్లే దారిలో చెత్త కుప్పలు

సింగరాయకొండ: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంటూ ఆర్భాటంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించే అధికారులు, సిబ్బంది..ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఆర్భాటంగా ర్యాలీలు నిర్వహించారు. కానీ ఆచరణలో అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉంది. మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో చెత్త నిల్వలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. గ్రామంతో పాటు మత్స్యకార పాలెంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఒక పక్క ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచిస్తుంటే ఇక్కడ మాత్రం అటువంటి చర్యలు కనిపించడం లేదు. కనీసం కాలువల్లో



వినియోగంలోకి రాని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

మురుగుతీసే పరిస్థితి కూడా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో రాత్రిళ్లు దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు.

ఆ కేంద్రాల వైపు చూడని అధికారులు..

గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించి అక్కడ వర్మీ కంపోస్టు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇక్కడ అవేమీ పట్టించుకోరు. ఊళ్లపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించడం లేదు. ఈ కేంద్రాన్ని శుభ్రం చేసి అద్దంలా తయారు చేసిన సిబ్బంది..గ్రామంలోని చెత్తను మాత్రం అక్కడకు తరలించడం లేదు. దీంతో గ్రామంలో చెత్త పేరుకుపోయి వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరో పక్క రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తను ఆవులు, గేదెలు మేస్తూ రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తను గ్రామం నుంచి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

హనుమంతునిపాడు: వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించేలా బడ్జెట్ సవరణ చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. సీపీఎం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెలిగొండను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామయ్య, కొండయ్య రాములు, వెంకటేశ్వర్లు, గురునాథ్, రైతులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మానవత కమిటీ సభ్యులు

పామూరు: మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన షేక్.మస్తాన్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ సందర్భంగా సోమవారం మస్తాన్ కుటుంబసభ్యులు వైద్యఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. స్పందించిన సంస్థ రూ.5 వేలు, దాతలద్వారా విరాళాలు సేకరించి రూ.17500లను రోగి బంధువులకు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ఎం మునయ్య, ఆర్థిక కార్యదర్శి తోట రమేష్, జమ్ముల శ్రీనివాసులు, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, షేక్.బాషామొహిద్దీన్, ఎస్.కృష్ణయ్య, షేక్.చాంద్‌బాషా, ఎం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలని ధర్నా



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరిరూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన పట్టారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు వారంతపు సెలవులు అమలు చేయాలని, కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను ఆప్కాస్‌లో నమోదు చేయాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యుల పేర్లు ఆప్కాస్‌లో చేర్చి ఉపాధి కల్పించాలని, నామినీల అకౌంట్‌లలో పీఎఫ్ అమౌంట్ వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ జోసఫ్‌కు అందచేశారు. యూనియన్ నాయకులు సీహెచ్ ప్రసాద్, ఓబయ్య, జాన్సన్, దానియేలు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: సీఎం చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నేత కాదని.. విషం చిమ్మే నేత అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు పనులు చేయనంటూ సీఎం చంద్రబాబు చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు దక్కకూడదన్నట్లు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రినా.. లేక తెలుగుదేశం పార్టీ వాళ్లకు మాత్రమే ముఖ్యమంత్రినా..? అని ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారని దద్దాల గుర్తు చేశారు.

ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. మొదటి రోజు 144 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు.

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 261 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సంవత్సరం పరీక్షకు 270 మంది హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

కనిగిరిరూరల్: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎంఎస్‌ఎం, జీజేసీ, ఎంఎస్‌ఆర్, నేతాజీ, కృష్ణా చైతన్య కళాశాలల కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఎస్‌కే ఖాజావలి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ డానియేల్ జోసఫ్

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మసీదుల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ డానియేల్ జోసఫ్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మసీదు కమిటీలతో సమావేశం నిర్వహించారు. మసీదు ప్రాంతాల్లో విద్యుత్, నీరు, పారిశుధ్యం, తదితర సమస్యల కల్పనకు తక్షణం స్పందించి పరిష్కరిస్తామన్నారు. మసీదు కమిటీలు పలు సమస్యలను, సలహాలను కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో మేనేజర్ ఐ ప్రసాద్‌రావు, ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూ సర్వే చేయాలి

– కనిగిరి ఆర్‌డీఓ కేశవరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవరెడ్డి

మర్రిపూడి: రైతుల సమక్షంలోనే భూ సర్వే చేసి హద్దులు చూపుతామని కనిగిరి ఆర్డీఓ కేశవరెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి డివిజన్ పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో 4900 అర్జీలు వచ్చాయన్నారు. వాటికి సంబంధించి 500 అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిలో కొంత మందికి నష్టపరిహారం

ఆయన దృష్టికి తీసుకుపోవడంతో..జీరో అవార్డు కింద భూములు కోల్పోయిన జాబితాను ప్రభుత్వానికి పంపించామని, అనరుమతులు రాగానే రైతులకు పరిహారం అందజేస్తామన్నారు. గార్లపేట గ్రామంలోని దళితులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు విచారణ చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జ్వాల నరసింహారావు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ జగదీష్, హౌసింగ్ ఏఈ భూపతిరాజ్, సుచరిత, ఏపీఎం గడ్డం రాంబాబు, ఆర్‌ఐ బత్తుల శ్రీనివాసులు ఉన్నారు.

అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అధికారుల సమక్షంలో లాటరీ తీస్తున్న రైతులు

టంగుటూరు: పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వేలం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియ గ్రామాల వారీగా లాటరీ ప్రకియ రైతులతో తీయించారు. ఈ సందర్భంగా వేలం కేంద్రంలోని 27 గ్రామాలను పొగాకు అమ్మకాల సౌలభ్యం కోసం 12 క్లస్టర్లుగా విభజించి లాటరీ తీశారు. 1వ క్లస్టర్ (చింతలపాలెం,దావగూడూరు గ్రామాలు), 2వ క్లస్టర్ (కాకుటూరివారిపాలెం, బి.నాయుడుపాలెం), 3 వ క్లస్టర్ (గొర్లమిట్ట, మల్లవరప్పాడు, మట్టిపాడు, శివపురం గ్రామాలు), 4వ క్లస్టర్ (చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలు), 5 వ క్లస్టర్ (జమ్ములపాలెం, తుమాడు గ్రామాలు), 6వ క్లస్టర్ (కె.ఉప్పలపాడు గ్రామం), 7వ క్లస్టర్(పొందూరు గ్రామం) 8వ క్లస్టర్ (ఆలకూరపాడు, అనంతవరం, జయవరం, పాలేటిపాడు, రావివారిపాలెం గ్రామాలు) 9వ క్లస్టర్ (కారుమంచి గ్రామం), 10వ క్లస్టర్ (సాదువారిపాలెం, టంగుటూరు, వావిలేటిపాడు, జరుగుమల్లి గ్రామాలు), 11వ క్లస్టర్ (ఎం.నిడమలూరు), 12వ క్లస్టర్ (కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలు)

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలి

కందుకూరు: వలేటివారిపాలెం మండలంలోని నలదలపూరు దళితకాలనీ మరమ్మతులకు గురైన ఆర్వోప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ తిరుమణిశ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ మాట్లాడుతూ దళితవాడలో మంచినీటి ఆర్వోప్లాంట్ చెడిపోయి నెల రోజులైనా అధికారులు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, పెత్తనం చేస్తున్న అధికార పార్టీ నాయకులు సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దువ్వూరి జాన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



కేజీబీలో వ్యాసరచన పోటీలు

హనుమంతునిపాడు: స్థానిక కేజీబీవీ పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జయహో మహిళా అంశంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం బాల్య వివాహాల వల్లకలిగే నష్టాలు, మహిళలపై దాడులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎస్సై ఎం.మాధవరావు, పోలీసులు, కేజీబీ ప్రిన్సిపాల్ అంజమ్మలు న్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



ర్యాలీలో సీడీపీఓ, సూపర్‌వైజర్లు

కనిగిరిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ముందుండాలని సీడీపీఓ పి.సరోజని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడో రోజు సంతకాల సేకరణ, మొక్కలు నాటడం, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ ఉపాధిలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం వల్ల మహిళా శ్రామికశక్తి రేటు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎంపీఎస్ పార్వతి, సుమతి, నాగమల్లేశ్వరి, ధనలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గ్రామస్తులు

సీఎస్‌పురం(పామూరు): బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం మతపెద్దలతో క్యాండిల్ ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

6న రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా

సీఎస్‌పురం(పామూరు): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు రైతు సంఘం మండల అధ్యక్షుడు ఏ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రత్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ పి.వెంకటేశ్వర్లుకు అందజేశారు. సీపీఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ గ్రామాల పరిశీలన



మాట్లాడుతున్న వైద్యాధికారి

కందుకూరు రూరల్: టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపికైన మండలంలోని కమ్మవారిపాలెం, నరిశెట్టివారిపాలెం గ్రామాలను వైద్యాధికారి సీహెచ్.రాకేష్ కుమార్ సోమవారం పరిశీలించారు. గత రెండేళ్ల నుంచి ఒక టీబీ కేసు కూడా నమోదు కానందున ఈ రెండు గ్రామాలను టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ల్యాబ్ సూపర్‌వైజర్ శివాజీ, ఎస్‌టీఎల్‌ఎస్ కె.శ్రీమన్నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ పరంజ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.59 లక్షలు



ఈఓకు విరాళం నగదు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,59,150 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.48,830, లడ్డు ప్రసాదాల అమ్మకంద్వారా రూ.22,760, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.82,044, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.5,516 వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదానానికి గూడూరుకు చెందిన మంచికంటి పుల్లయ్య, విజయలక్ష్మిగారు విరాళం నగదు రూ.44,116లను పామూరుకు చెందిన మంచికంటి మధుసూదనరావు ద్వారా అందజేసినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ముదుమాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

హనుమంతునిపాడు: మండలంలో చిట్యాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్యాల విజయ్‌భాస్కర్ రెడ్డి, ఆయన తండ్రి చిట్యాల సుధాకర్‌రెడ్డి రెండు నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. హాజీపురం ఎస్సీ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దారా స్టాలిన్ కుటుంబాన్ని పరామర్శించి తండ్రి జక్రయ్యకు రూ.12 వేలు అందజేశారు. అదే విధంగా దాసళ్లపల్లి ఎస్సీ కాలనీలో బొజ్జ సలోమి ఇటీవల మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించి భర్త బొజ్జ ప్రకాశంకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్టు సేవలను వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో నందనవనం సర్పంచ్ సూరిశెట్టి నారాయణస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రాసాదు, కొండారెడ్డిపలి ఎంపీటీసీ రుద్రపాటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదుల ఏరియాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.